

సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 28 । అక్టోబర్ । 2024



మైమరపించే జలపాతాలు
పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని జలపాతాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వర్షపు నీటితో నూతన శోభను సంతరించుకున్నాయి. 8లో



లాభం కరువై..
మామిడి సాగు వృథా అనే భావనలో రైతులు ఉన్నారు. ఆశించిన మేర లాభాలు రాకపోవడంతో తోటలను తొలగిస్తున్నారు. 8లో



ఛైన్ స్నాచింగ్
పెళ్లికి వెళ్లి బైక్‌పై వస్తున్న దంపతులను టార్గెట్ చేసిన దుండగులు వారి నుంచి బంగారు గొలుసు అపహరించారు. 8లో

న్యూస్‌రీల్

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

భీమవరం : 104లో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో 104 ఉద్యోగుల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ 104లో పనిచేస్తున్న డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రతినెలా జీతాలు ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్టాలన్నీ అమలు చేయాలని కోరారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో ఉన్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా ఐక్యంగా రానున్న కాలంలో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్ఎం విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వీవీఎస్ సురేష్ మాట్లాడుతూ 104 ఉద్యోగులు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. సుందర్‌సింగ్, పి.రామకృష్ణ, సుదర్శన్, దివ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో ‘పశ్చిమ’ ముందంజ



తలపడుతున్న బాలికలు

పెనుమంట్ర : మార్టేరులోని వేణుగోపాల హైస్కూల్ ఆవరణలో 68వ అంతర్ జిల్లాల అండర్–17 బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. బాలురు, బాలికల విభాగాల్లో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు నువ్వా నేనా అన్నట్టు జరిగాయి. పశ్చిమగోదావరి జిల్లా జట్లు సత్తాచాటాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, అనంతపురం జట్లు, బాలుర విభాగంలో నెల్లూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం సెమీఫైనల్స్, ఫైనల్స్ పోటీలు జరుగనున్నట్టు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి ఎ.అంజలి తెలిపారు.

కాలువ గట్టు.. వదిలితే ఒట్టు



పోలవరం కుడికాలువ గట్టును తవ్వి మట్టి లోడు చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: తెలుగు తమ్ముళ్లు పోలవరం కుడి కాలువ గట్టును తవ్వి మట్టిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం వద్ద పోలవరం కుడికాలువ గట్టును కొందరు టీడీపీ నాయకులు కొద్దిరోజులుగా రాత్రివేళల్లో కొల్లగొడుతున్నారు. పొక్లయిన్ల సాయంతో గట్టును తవ్వి మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ముఖ్యంగా శని, ఆదివారాలు రాత్రి వేళల్లో ఇక్కడ పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరిగాయి. ఒక్కో టిప్పర్ మట్టిని దూరాన్ని బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. రెండు రోజులుగా తవ్విన మట్టిని మండలంలో ఓ టీడీపీ నేత నిర్మిస్తున్న పెట్రోల్ బంకు స్థలం చదును చేసేందుకు వినియోగిస్తున్నారు. ఇదిలా ఉంటే అక్రమ తవ్వకాలు కావడంతో డ్రైవర్లు టిప్పర్లను అతివేగంగా నడుపుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శ్రీవారి సేవలో అడిషనల్ డీజీ



చంద్రశేఖర్‌కు శ్రీవారి జ్ఞాపికను అందిస్తున్న ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని అడిషనల్ డీజీ చంద్రశేఖర్ (ఢిల్లీ ఇంటెలిజెన్స్ బ్యూరో) ఆదివారం సందర్శించారు. ఆయనకు అధికారులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను ఆయన దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. పండితులు ఆయనకు శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలి కారు. ఏఈఓ నటరాజరావు శ్రీవారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

నివాస గృహాలపై నిర్లక్ష్యం

గూడు గోడు పట్టదు
- జిల్లాలో నిలిచిన 43 వేలకుపైగా నిర్మాణాలు
- పైసా విదల్చని కూటమి సర్కారు
- ప్రశ్నార్థకంగా పేదలందరికీ ఇళ్ల పథకం
- ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వం



నిర్మాణం.. ప్రశ్నార్థకం.. ఏలూరు రూరల్ మండలంలో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో పేదలందరి సొంతింటి కలను సాకారం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఇల్లు లేని కుటుంబం ఉండకూడదనే ఉద్దేశంతో అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు గృహ నిర్మాణాలకు ప్రోత్సహించారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. గద్దెనెక్కిన కూటమి సర్కారు పేదలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తయినా ఇళ్ల నిర్మాణాలపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఇళ్లను నిర్మించే కాంట్రాక్టర్లను సైతం తరిమేలా చర్యలు తీసుకుంటోంది. నిర్మాణాలకు ముందుకు వచ్చే కాంట్రాక్టర్లకు అవకాశం కల్పించకపోగా, పేదలనే కట్టుకోండి అంటూ గృహ నిర్మాణాలను ప్రభుత్వం గాలికి వదిలేసింది.

కొత్తగా ఒక్క ఇల్లూ ఇవ్వలేదు
గత జగన్ సర్కారులో ఏలూరు జిల్లాలో 1,03,264 గృహాలను మంజూరు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వీటిని అలాగే ఉంచడంతో పాటు కొత్తగా ఒక్క ఇంటిని కూడా మంజూరు చేయలేదు. కనీసం నిర్మాణాలపై దృష్టి సారించడం లేదు. దీంతో జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టు మారింది. గతంలో గృహ నిర్మాణాలను మూడు కేటగిరీలుగా విభజించారు. కేటగిరీ–1లో లబ్ధిదారుడే నిర్మాణాలు పూర్తిచేసుకోవాలి. కేటగిరీ–2లో ప్రభుత్వం ఇచ్చే సొమ్ములతోనే ప్రభుత్వమే ఇంటిని కట్టిస్తుంది. కేటగిరీ–3లో కాంట్రాక్టర్ల ద్వారా పూర్తి చేయించి అనంతరం బిల్లు లు చెల్లిస్తుంది. అయితే ప్రస్తుత ప్రభుత్వం కేటగిరీ–1 విధానంలో నిర్మాణాలను పూర్తిచేయించేలా చర్యలు తీసుకుంటోంది. కేటగిరీ–2, కేటగిరీ–3 విధానాలకు స్వస్తి పలికింది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన 1,03,264 గృహాల్లో కొన్ని నిర్మాణాలు పూర్తి కాగా సుమారు 43,316 ఇళ్లు పలు దశల్లో నిలిచిపోయాయి. నాలుగు నెలలుగా వీటిలో కదలిక లేదు.

గత ప్రభుత్వంలో గృహ నిర్మాణాలు

మొత్తం ఇళ్ల మంజూరు	1,03,264
నిర్మాణాల కోసం వెచ్చించిన నిధులు	రూ.849.10 కోట్లు

ప్రస్తుతం నిలిచిన ఇళ్ల నిర్మాణ స్థితి

బేస్‌మెంట్ స్థాయికి దిగువ	21,042
బేస్‌మెంట్ స్థాయి	11,646
లింటెల్ స్థాయి	4,340
రూఫ్ స్థాయి	3,478
శ్లాబ్ స్థాయి	2,810
మొత్తం	43,316

ప్రకటనలకే పరిమితం
తాము అధికారంలోకి వస్తే 2 నుంచి 3 సెంట్లు స్థలాలు ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేశారు. ఇప్పుడు వీటి మాట ఊసెత్తకపోగా.. నిర్మాణాలు ప్రారంభించిన నిర్మాణాలపైనా నిర్లక్ష్యం చూపుతున్నారు. దీనిని చూస్తే పేదల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణాలకు రూ.849.10 కోట్లు వెచ్చించి జగన్ మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలిచారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

జిల్లా ఎస్పీ నయీం అస్మి



భీమవరం : జిల్లాలో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బాణసంచా విక్రయించే తాత్కాలిక షాపులను పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. షాపుల వద్ద నీరు, పొడి ఇసుక, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనలు మీరి దీపావళి మందు గుండు సామగ్రి కలిగి ఉన్నా, తయారు చేసినా లేదా అనధికార ప్రదేశాల్లో నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా డయల్ 100, డయల్ 112 లేదా పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

అప్లయిడ్ సైన్సెస్‌పై దృష్టి పెట్టండి

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

తాడేపల్లిగూడెం: అప్లయిడ్ సైన్సెస్‌పై విద్యార్థులు దృష్టి పెట్టి సమస్యలకు సరళీకరణ పరిష్కారం కనిపెట్టాలని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పిలుపునిచ్చారు. స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన దేశ విద్యార్థులు ప్రపంచంలో పోటీపడుతున్నారని, విజ్ఞానం, సైన్స్ విషయాల్లో అగ్రగామిగా ఉంటే పలు ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయన్నారు. ముఖ్యంగా ప్యూర్ సైన్సెస్, అప్లయిడ్ సైన్సెస్‌లపై దృష్టి పెట్టాలన్నారు. సీవీ రామన్ తర్వాత సైన్స్‌లో భారతీయులెవరికీ నోబెల్ బహుమతి రాలేదని, కార్పొరేట్ కంపెనీల్లో భారతీయుల హవా కొనసాగుతున్నా ప్యూర్ సైన్సెస్‌లో వెనుకబడి ఉన్నామన్నారు.

రక్షిత సాగునీరు అందించేలా..
గోదావరి జిల్లాలంటే మంచినీటికి కొరత ఉండకూడదని.. అయితే ఇక్కడ పర్యటించిన సందర్భంలో తాగునీటి కోసం ప్రజలు అడుగుతుంటే ఆశ్చర్యంగా ఉందని గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలో రక్షిత తాగునీరు అందించేందుకు నిట్ శాస్త్రవేత్తలు టెక్నాలజీని వినియోగించాలన్నారు. ఇలాంటి విషయాలపై దృష్టి పెడితే వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన అన్నారు. పోలవరం జలాలను సద్వినియోగం చేసుకోవాలంటూ గతంలో పోలవరం నుంచి విజయవాడ వరకు తాను పాదయాత్ర చేసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. తాడేపల్లిగూడెంతో తనకు చక్కటి అనుబంధం ఉందన్నారు. స్వచ్ఛమైన బెల్లం తయారీ, వ్యర్థాల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి కొత్త పద్ధతులు అభివృద్ధి చేసే దిశగా ఆలోచనలు సాగాలని ఆయన కోరారు. స్పందన ఫౌండేషన్ అధ్యక్షురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ నిబద్ధత, అంకితభావం, అనుభవం వల్ల ఇంద్రసేనారెడ్డి గవర్నర్ స్థాయికి ఎదిగారన్నారు. అనంతరం గవర్నర్‌ను ఘనంగా సత్కరించారు. ఆర్డీఓ భవానీ శంకరి, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంపీడీఓ ఎం.విశ్వనాథ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ముందుగా పెదతాడేపల్లి సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యార్థులు బ్యాగ్ పైపర్ బ్యాండ్‌తో గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు.

సంస్థాగత బలోపేతంతో ముందుకు..

- కార్యకర్తలకు అండగా నిలవాలి
- సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి. చిత్రంలో పార్లమెంట్ ఇన్‌చార్జి ఉమాబాల

నరసాపురం : వైఎస్సార్‌సీపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి పార్టీ నాయకత్వం దృష్టి పెట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోయామనే నైరాశ్యంలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉండాలని, వారిలో స్ఫూర్తిని నింపాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని, వారికి వెన్నంటి ఉండాలని నాయకత్వానికి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. కూటమి సర్కారు నాలుగు నెలల పాలనలోనే ప్రజల నుంచి వ్యతిరేత మూటకట్టుకుందన్నారు. వైఎస్సార్‌సీపీకి పూర్వం వైభవం వస్తుందని, త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనే తేటతెల్లం చేయగల సామర్థ్యం పార్టీ కార్యాకర్తల్లో ఉందన్నారు. ఇకపై పార్టీ మండల, గ్రామ, వార్డు కమిటీల సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అలాగే త్వరలో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలపై, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓట్లు చేర్పించడంపై పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పార్టీ శ్రేణులకు సంబంధించి పట్టభద్రులు ఎవరైనా ఉంటే వెంటనే ఓటు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, పార్టీ కేంద్రపాలక మండలి సభ్యుడు పీడీ రాజు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి



జిల్లా ఎస్పీకి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు ఉత్తమ సేవలు అందించగలమన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఏలూరు ఆశ్రం, ఆంధ్ర హాస్పిటల్, స్టార్ డెంటల్, శ్రీ డెంటల్, వాసన్ ఐకేర్, ఇతర వైద్య సంస్థల డాక్టర్లు పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. జిల్లా ఎస్పీ శివకిషోర్ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఆర్ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఆశ్రం ఆస్పత్రి డీజీఎం సాయి శ్రీనివాస్, పీఆర్వో దుర్గాప్రసాద్, ఆంధ్ర ఆస్పత్రి వైద్యాధికారులు ఎస్.మురళీకృష్ణ నేతృత్వంలో వైద్య పరీక్షలు జరిగాయి. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ లక్ష్మణ్, ఆర్ఎస్సైలు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర సెక్రటరీ బండారు నాని, జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శానం రమేష్‌బాబు పాల్గొన్నారు.

చేపల మేతగా కోళ్ల వ్యర్థాలు

ప్రజారోగ్యంతో చెలగాటం
- వ్యర్థాలను వ్యాపారంగా మార్చిన ముఠాలు
- రెండు నెలల్లో 30 మందిపై కేసులు
- చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక



చికెన్ వ్యర్థాలను గోతుల్లో పూడుస్తున్న దృశ్యం

నిడమర్రు : చేపల చెరువుల్లో మేత ఖర్చులు తగ్గించుకునేందుకు కొందరు యజమానులు అడ్డదారులు తొక్కుతున్నారు. చెరువుల్లో చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలను చల్లుతుండటం అటు పర్యావరణంతో పాటు ఇటు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదంగా మారింది. ముఖ్యంగా కొల్లేరు గ్రామాల్లో కోళ్ల వ్యర్థాల కొనుగోళ్లు, రవాణా జోరుగా సాగుతోంది. పోలీసులు ఈ ముఠాపై నిఘా ఉంచి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నా ముఠా సభ్యులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుంటున్నారు. పోలీసులు నిడమర్రు మండలంలో రెండు నెలల్లో 12 కేసుల్లో 30 మందిపై కేసులు నమోదు చేసి వారి వాహనాలు సీజ్ చేశారు.

కిలో రూ.15 చొప్పున..
చికెన్ షాపుల్లో వ్యర్థాలను దుకాణదారులు వృథాగా పడేసేవారు. కొందరు వీటిని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. చికెన్ దుకాణాల వద్ద ప్రత్యేక ప్లాస్టిక్ డ్రమ్ములను సైతం ఏర్పాటు చేసి వ్యర్థాలను కిలో రూ.5 నుంచి రూ.8 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో చికెన్ వ్యాపారులు వీటిని భద్రపరిచి వారికి విక్రయిస్తున్నారు. ముఠా సభ్యులు ఇలా కొనుగోలు చేసిన వ్యర్థాలను వాహనాల్లో తరలించి చేపల పెంపకందారులకు కిలో రూ.15 వరకు విక్రయిస్తున్నారు.

చేపలు త్వరగా ఎదిగేందుకు..
చెరువుల్లో చేపలు త్వరగా పెరగడానికి, మేత ఖర్చు తగ్గించుకోవడానికి చెరువుల నిర్వాహకులు బ్రాయిలర్/ ఫారం కోళ్ల (చికెన్) వ్యర్థాలను ఆహారంగా వేస్తున్నారు. ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, తణుకు, రావులపాలెం, రాజమండ్రి తదితర ప్రాంతాల్లోని చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను, వారంతపు సంతల్లో చౌకగా లభించే పశు మాంసం కూడా తీసుకువస్తున్నట్టు తెలిసింది. వీటిని ఉడకబెట్టి చెరువుల్లో చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ఏటా భీమడోలు, నిడమర్రు, పెదపాడు మండలాల్లో ఇలాంటి వ్య ర్థాల ద్వారా రూ.3 కోట్ల వరకు వ్యాపారం జరుగుతున్నట్టు అంచనా.

అనారోగ్యం తప్పదు
చికెన్ వ్యర్థాలతో పెంచిన చేపలు తింటే అనారోగ్యం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్యాట్ ఫిష్ తింటే ప్రాణాంతక క్యాన్సర్ వస్తుందని గతంలో వీటి సాగును నిషేధించారు. అయినా గుట్టుచప్పుడు కాకుండా క్యాట్‌ఫిష్, ఫంగస్ చేపల పెంపకం సాగుతోంది. ఆయా చెరువుల్లో క్యాట్ ఫిష్, ఫంగస్ చేపలు త్వరగా ఎదిగేందుకు కోడి, పశు వ్యర్థాలను వినియోగిస్తున్నారు.

వినియోగిస్తే కేసులు



చికెన్ వ్యర్థాలు రవాణా చేసే డ్రైవర్, వాహన యజమానితోపాటు వీటిని వినియోగించే చెరువుల యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తున్నాం. రెండు నెలల్లో ఈ చికెన్ వేస్ట్ తరలించే 30 మందికి పైగా కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేశాం. రాత్రి వేళల్లో కొల్లేరు గ్రామాల మార్గాల్లో పోలీస్ గస్తీ పెంచాం. వ్యర్థాల రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవు.
– ఎన్.వీరప్రతాప్, ఎస్సై, నిడమర్రు

‘ఎగ్’బాకుతోంది

- కోడిగుడ్డు ధర పైపైకి..
- బహిరంగ మార్కెట్‌లో ఒక్కోటి రూ.7
- కూరగాయల ధరలతో పోటీగా పెరుగుదల



నూజివీడు: కూరగాయల ధర ఆకాశన్నంటి పేదలకు భారంగా మారిన నేపథ్యంలో కోడిగుడ్డు ధర సైతం పోటీగా కొండెక్కింది. కొద్దిరోజులుగా ఒక రోజు ఉన్న ధర మరో రోజు ఉండటం లేదు. స్థానిక రైతు బజారులో కోడిగుడ్డు ధర రూ.6.22కు చేరింది. అదే బహిరంగ మార్కెట్‌లో అయితే రిటైల్ ధర గుడ్డు రూ.7 పలుకుతోంది. కొన్నిచోట్ల అంత కంటే ఎక్కువగానే విక్రయిస్తున్నారు. 30 కోడిగుడ్ల అట్ట రూ.190కు విక్రయిస్తున్నారు. 20 రోజుల క్రితం రూ.150 నుంచి రూ.160 మాత్రమే ఉన్న అట్ట ధర ఒక్కసారిగా భారీగా పెరిగింది. నిలకడ లేకుండా రోజూ ఐదు పైసల నుంచి పదిహేను పైసల వరకు గుడ్డు ధర పెరుగుతోంది. ఇది మరింత పెరగనుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కోడిగుడ్డు ధర పెరుగుతుండటంతో హోటళ్లలో ధరలు సైతం పెంచుతున్నారు. తక్కువ ధరకు లభించే పౌష్టికాహారంగా కోడిగుడ్డును పేదలు ఎక్కువగా వినియోగిస్తారు. అయితే ఇప్పుడు కోడిగడ్డు ధర పెరుగుతున్న నేపథ్యంలో వీటిని కొనేందుకు సామాన్యులు ఆలోచిస్తున్నారు. ఒక వైపు కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతుండగా, దానికి సమాంతరంగా గుడ్డు ధర కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

మేత ఖర్చులు తడిసి మోపెడు
గతంలో కంటే ప్రస్తుతం కోళ్లఫారాల్లో కోళ్లకు వేసే మేత ఖర్చులు విపరీతంగా పెరగడంతో గుడ్డు ధర తప్పనిసరి పరిస్థితుల్లో పెంచాల్సి వస్తుందని కోళ్లఫారాల యజమానులు అంటున్నారు. మొక్కజొన్న, బియ్యం నూక ధరలు పెరగడం, అలాగే కూలీ ఖర్చులు రోజురోజుకూ పెరుగుతుండటంతో కోడిగుడ్డు ధరలు సైతం పెరుగుతున్నాయని పౌల్ట్రీ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు.

పెరుగుతున్న డిమాండ్
అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో భోజన పథకాలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో కోడిగుడ్లను విద్యార్థులకు అందిస్తున్నారు. అలాగే పల్లెల్లో, పట్టణాల్లో, నగరాల్లో న్యూడిల్స్ బండ్లు పెరగడంతో వీటి వాడకం కూడా విపరీతంగా పెరిగింది. దీంతో ఇటీవల కోడిగుడ్లకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో ధర పెరుగుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

రోజురోజుకూ పెరుగుతూ..



ప్రస్తుతం కూరగాయలను కొనలేని పరిస్థితి ఉండగా వాటికి తోడు కోడిగుడ్ల ధర రోజురోజుకూ పెరుగుతోంది. గుడ్డు ఒకటి విడిగా దుకాణాల్లో రూ.7 ధర పలుకుతోంది. ఇటు కూరగాయలు అటు కోడిగుడ్ల ధరలు పెరగడంతో పేదలు పచ్చడి మెతుకులకు పరిమితమవ్వాల్సి వస్తోంది.
– బొల్లిపాం అరుణకుమారి, గృహిణి, నూజివీడు

క్లుప్తంగా

మంగమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు



గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మకు భక్తులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఆలయ కమిటీ నాయకులు, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాలోపాటు తెలంగాణ ప్రాంతం నుంచి కూడా భారీగా భక్తులు వాహనాల్లో తరలివచ్చారు.

బీచ్‌కు తరలివచ్చిన సందర్శకులు



బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

మొగల్తూరు: గత మూడు రోజులుగా ఎండలు కాస్తుండటం, వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఆదివారం పేరుపాలెం బీచ్‌కు పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన సందర్శకులతో కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌ల్లో సందడి నెలకొంది. బీచ్‌కు వచ్చిన సందర్శకులు సముద్ర స్నానం చేస్తూ ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న అలల మధ్య సరదాగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

29న జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

ఉంగుటూరు: ఈ నెల 29న మంగళవారం జిల్లా స్థాయి ఖోఖో పోటీలు కైకరం హైస్కూలు గ్రౌండులో జరుగుతాయని పాఠశాల హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. అండర్‌-14, అండర్‌-17 విభాగాలలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపికలు జరుగుతాయని తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

భీమవరం: రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందినట్లు భీమవరం రైల్వే ఎస్సై పి.టి.వి రమణ ఆదివారం తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం 27న కైకలూరు రైల్వే స్టేషన్‌లో నర్సాపురం– గుంటూరు రైలు నుంచి సుమారు 70 ఏళ్ల వ్యక్తి జారిపడిపోయాడన్నారు. 108 అంబులెన్స్‌లో కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ మరణించాడని తెలిపారు. మృతదేహం కైకలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉందని వివరాలు తెలిసిన వారు 70939 39777, 97056 494942 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని యువకుడి మృతి



స్థానిక రైల్వే స్టేషన్ వద్ద మృతి చెందిన యువకుడు

ఆకివీడు: స్థానిక రైల్వే స్టేషన్ ఎదుట గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. రోడ్లపై చెత్త కాగితాలు, వాటర్ బాటిళ్లు ఏరుకునే వ్యక్తిగా స్థానికులు చెబుతున్నారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మైమరపించే జలపాతాల సవ్వడి

- పశ్చిమ మన్యంలో అలరారే అందాలు
- కార్తీక మాసంలో ముంజులూరు జలపాతానికి సందర్శకుల తాకిడి
- దారి తెలియని వారి కోసం గైడ్ ఏర్పాటు

బుట్టాయగూడెం: పచ్చని అడవి మధ్యలో కనువిందైన అందాల జలపాతాలు. ఉమ్మడి పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని సుందర జలపాతాలు సందర్శకులకు ఆకట్టుకుంటున్నాయి. కొండ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వచ్చి చేరుతున్న వరద నీటి ప్రవాహంతో జలపాతాల కొత్త శోభ సంతరించుకున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు తెలంగాణ సరిహద్దు గ్రామాల నుంచి సందర్శకులు బుట్టాయగూడెం మండలం ముంజులూరు అటవీ ప్రాంతంలో ఉన్న ఏనుగు తోగు జలపాతం చూసేందుకు తరలివస్తారు. బుట్టాయగూడెం మండలంలో ముంజులూరు సమీపంలో ఉన్న ఏనుగుతోగు జలపాతంలో పాటు ఉప్పరిల్ల జలపాతం, ఉయ్యాల తోగు జలపాతం పాపికొండల సమీపంలో సాగరాల జలపాతం, జలతారు వాగు జలపాతం కనువిందు చేస్తున్నాయి. మరో వారం రోజుల్లో కార్తీకమాసం ప్రారంభం కానుండడంతో ఈ ప్రాంతంలో పర్యాటకుల సందడి మరింత పెరిగే అవకాశం ఉంది.

అడవిలో ఆహ్లాదకర ప్రయాణం

బుట్టాయగూడెం మండలంలోని అటవీ ప్రాంతంలో ఐదు జలపాతాలు ఉన్నప్పటికీ ముంజులూరు సమీపంలో ఉన్న ఏనుగుతోగు జలపాతం సందర్శనకు ఎక్కువ మంది వస్తారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని దగ్గర గ్రామాల నుంచి సందర్శకులు ఇక్కడికి వచ్చి జలపాతాల అందాలను ఆస్వాదిస్తున్నారు. ముంజులూరు శివారు నుంచి ఎడమ వైపు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. రహదారిలో పచ్చని చీర పరుచుకున్నట్లు అడవి తల్లి అందాలు కనువిందు చేస్తాయి. వెదురు కూపుల వనం అందంగా పరుచుకున్నాయి. రాతి బండల మధ్య నీటి ప్రవాహం సవ్వడులు మనసును దోచుకుంటాయి.



ముంజులూరు ఏనుగుతోగు కొండపై జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



జలపాతం వద్ద సందర్శకులు



పాపికొండల అభయారణ్యంలో జలతారు వాగు

గైడ్ ఏర్పాటు చేసిన గిరిజనులు

ఏనుగుతోగు జలపాతం సందర్శనకు వచ్చే కొత్త వారికి దారి చూపించేందుకు స్థానిక గిరిజనులు ఒక గైడ్‌ను ఏర్పాటు చేశారు. దారి తెలియని సందర్శకులకు గైడ్ వారిని జలపాతం వద్దకు తీసుకెళ్తాడు. అడవిలో కొంతదూరం వెళ్లిన తర్వాత దట్టమైన అడవిలో మూడు దార్లు ఉంటాయి. అక్కడ జలపాతం వెళ్ళే దారి తప్పితే అడవిలో మారిపోయే ప్రమాదం ఉంది. మహిళా సందర్శకుల కోసం బట్టలు మార్చుకొనేందుకు తడికలతో రూంలు ఏర్పాటు చేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి



జలపాతాల సందర్శనకు వెళ్ళే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. జలపాతం ప్రదేశంలో పాకుడు కట్టి జారిపోయే అవకాశం ఉంది. ఎత్తైన ప్రదేశాలకు వెళ్లడం మంచిది కాదు. అనుకోని ప్రమాదం జరిగితే రోడ్డు మార్గం సక్రమంగా లేనందున ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పర్యాటకులు జలపాతాల వద్ద కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలి.

డి. దుర్గా మహేశ్వరరావు, ఎస్సై, బుట్టాయగూడెం

గైడ్‌ను ఏర్పాటు చేశాం



ముంజులూరు సమీపంలోని జలపాతం చాలా అందంగా ఉంటుంది. ఈ జలపాతం సందర్శకులను కనువిందు చేస్తుంది. ఈ జలపాతానికి వచ్చే సందర్శకులకు అడవిలో దారి తెలియని వారి కోసం గైడ్‌ను ఏర్పాటు చేశాం.

కెచ్చెల ముక్కారెడ్డి, సర్పంచ్, ముంజులూరు, బుట్టాయగూడెం మండలం

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

అటవీ ప్రాంతంలో ఉన్న జలపాతాలు చూసేందుకు సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతుంది. ఈ ప్రాంతాన్ని పర్యాటకు ప్రాంతంగా తీర్చిదిద్ది అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం కృషి చేయాలని సందర్శకులు కోరుతున్నారు. సందర్శకులు కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ వైర్లకు చెట్లు కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వైర్లకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించాలని కోరుతూ సాక్షిలో ఆదివారం 'పొంచి ఉన్న ప్రమాదం' కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ అధికారులు ఆదివారం ఉదయమే పాతూరు ఇండోర్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. దీనిపై విద్యుత్ ఏఈ లీలావతి మాట్లాడుతూ మిగిలిన ప్రాంతాలలో సైతం విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న విద్యుత్ కొమ్మలను గుర్తించి, తొలగిస్తామని తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి హత్య



మారెళ్ళ రాంబాబు, మృతుడు

మొగల్తూరు: మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తుల మధ్య గొడవ ఏర్పడడంతో.. ఒక వ్యక్తి హత్యకు గురైనట్టు ఎస్సై జి.వాసు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మోడి గ్రామానికి చెందిన మారెళ్ళ రాంబాబు (48) శనివారం రాత్రి మద్యం తాగేందుకు ముత్యాలపల్లికి వెళ్ళాడు. మోడి సెంటర్‌లో రామాలయ పునః నిర్మాణ సమావేశం జరుగుతోంది. అక్కడికి వచ్చిన రాంబాబుకు అదే గ్రామానికి చెందిన జడ్డు నాయుడు, మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప గ్రామానికి చెందిన ఉంగరాల వీరన్నలు మధ్య వివాదం నెలకొంది. ఆవేశానికి గురైన నాయుడు, వీరన్నలు రాంబాబును కొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. జడ్డు నాయుడు పరారీలో ఉండగా వీరన్నను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

గిరిజనుడి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: గిరిజనుడు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో ఆదివారం దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఫిబ్రవరి 6న బుట్టాయగూడెం మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడి కారు బైక్‌ను ఢీకొనడంతో కోకోల వెంకటరెడ్డి మృతిచెందాడన్నారు. బైక్ కారును ఢీకొనడం వల్లే వెంకటరెడ్డి మృతిచెందినట్లు చిత్రీకరించారన్నారు. ఈ కేసులో కారు నడుపుతున్న డ్రైవర్ మరపట్ల చింతారావుపై కేసు నమోదు చేశారన్నారు. అమాయక దళిత డ్రైవర్‌ను కేసులో ఇరికించిన సదరు టీడీపీ నాయకుడిపై హత్య కేసుతో పాటు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రముఖ విద్యావేత్త అలుగు ఆనంద్ శేఖర్, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు, ఆదివాసి జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కెవీపీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి తొర్లపాటి శ్రీనివాస్, బహుజన సమాజ్ పార్టీ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి కలపాల రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన బాస్కెట్ బాల్ పోటీలు



మెన్ విభాగంలో అవార్డు అందుకుంటున్న స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులు



మహిళల విభాగంలో విజేతగా సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులు

భీమవరం: ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ మెన్ అండ్ ఉమెన్ బాస్కెట్ పోటీలు ఆదివారం ముగిశాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. విజేతల వివరాలను కళాశాల ఫిజికల్ డైరెక్టర్, క్రీడల కమిటీ కన్వీనర్ డాక్టర్ పి.సత్యనారాయణరాజు మీడియాకు వివరించారు. నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలకు బాస్కెట్ బాల్ పురుషుల విభాగంలో ప్రథమ స్థానం, గుంటూరు జిల్లా నంబూరు వీవీఐటి కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలోనూ విజయం సాధించారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు ఉమెన్ బాస్కెట్ బాల్ విభాగంలో ద్వితీయ స్థానం, నెట్‌బాల్ మెన్ విభాగంలో ప్రథమ స్థానం, మహిళల విభాగంలో ప్రథమ స్థానం దక్కింది. బాస్కెట్ బాల్ పురుషుల విభాగంలో తృతీయ స్థానం గుంటూరు కేహెచ్‌ఐటీ కళాశాలకు, భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు సంయుక్తంగా దక్కింది. ఉమెన్ బాస్కెట్ బాల్ విభాగంలో ప్రథమ స్థానం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాధించగా, తృతీయ స్థానం గుంటూరు సెంట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల, ఒంగోల్ క్యూఐసీ కళాశాలకు సంయుక్తంగా దక్కింది. నెట్‌బాల్ మెన్ విభాగంలో ద్వితీయ స్థానం విజయవాడ పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు, తృతీయ స్థానం సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలకు సంయుక్తంగా దక్కింది. మహిళల విభాగంలో వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, విజయవాడ ద్వితీయ స్థానంలోనూ, పీవీపీ సిద్ధార్థ, ఆదిత్య కలిసి తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, జేఎన్టీయూకే ఇంటర్ కాలేజీ ఎట్ టోర్నమెంట్ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు చేతుల మీదగా బహుమతులు అందించారు.

సామాజిక కార్యకర్త నాసర్ పాషాకు అవార్డు



సేవా రత్న అవార్డు అందుకున్న సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా

టి.నరసాపురం: బహుజన సాహిత్యం అకాడమీ (బి.ఎస్.ఏ) 2024 సంవత్సరానికి ఉత్తమ సామాజిక సేవకులకు జాతీయ సేవా రత్న అవార్డును టి.నరసాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా అందుకున్నారు. ఆదివారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు, సంస్థకు అవార్డు అంకితమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్.. దంపతులకు గాయాలు

పెంటపాడు: పెళ్లికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్న దంపతులను టార్గెట్ చేసుకున్న దుండగులు వారి నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండల శివారులోని ముదునూరు వద్ద జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడేనికి చెందిన గంగుల నాగరాజు, గంగుల సత్యవతి దంపతులు శనివారం రాత్రి భీమవరంలో బంధువుల పెళ్లికి హాజరయ్యారు. తిరిగి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తున్న సమయంలో వారిని బైక్‌పై వెనుక నుంచి అనుసరించిన దుండగులు సత్యవతి మెడలోని గొలుసుపై కన్నేశారు. గొలుసు అపహరణకు యత్నించే క్రమంలో దంపతులిద్దరినీ కొంతదూరం ఈడ్చుకొని వెళ్లారు. ఈ క్రమంలో మూడు కాసుల బంగారు గొలుసు తెంపుకొని బైక్‌పై ఉడాయించారు. బైక్‌పై నుంచి పడిపోయిన దంపతులిద్దరూ గాయాలపాలవడంతో స్థానికులు గమనించి వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దంపతులిద్దరూ చికిత్స అనంతరం అదే రాత్రి ఇంటికి వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పెంటపాడు ఎస్ఐ స్వామి తెలిపారు.

మద్యం మత్తులో రెస్టారెంట్‌పై దాడి



దాడిలో పగిలిన టీవీ

ఏలూరు టౌన్: ఏలూరు జీజీహెచ్ అవుట్‌గేట్ రోడ్డులోని ఒక రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు వెళ్ళిన యువకులు రెస్టారెంట్‌లోని సిబ్బందితో గొడవపెట్టుకుని, టీవీ, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఆరుగురు యువకులు దౌర్జన్యానికి దిగుతూ రెస్టారెంట్‌లోని సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తిస్తూ దాడి చేశారు. ఏలూరు జీజీహెచ్ సమీపంలోని ఫుడ్ ఇంజినీర్స్ రెస్టారెంట్‌కు ఆదివారం మద్యం సేవించి ఆరుగురు యువకులు వచ్చారు. రెస్టారెంట్‌లో ఆహారాన్ని తిని అనంతరం సర్వర్‌తో బిల్లు విషయంలో గొడవకు దిగారు. తీవ్రస్థాయిలో ఘర్షణకు దారితీసింది. రెచ్చిపోయిన యువకులు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఏలూరు టూటౌన్ పోలీసులు వివరాలు సేకరించారు. రెస్టారెంట్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాభం కరువై.. పెట్టుబడి భారమై

మామిడి తోటలు నరికేస్తున్న రైతులు



నూజివీడు ప్రాంతంలో మామిడితోటల నరికివేత

నూజివీడు: మామిడి తోటలకు పేరుగాంచిన నూజివీడు డివిజన్‌లో తోటల విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. మామిడి సాగు వృథా అనే భావనలో రైతులు ఉన్నారు. ఆశించిన మేర లాభాలు రాకపోవడంతో రైతులు తోటలను నరికించేస్తున్నారు.

ఒకప్పుడు మామిడితోటలే జీవనాధారంగా ఉన్న నూజివీడు డివిజన్‌లో నేడు మామిడి తోటలంటే అయిష్టత చూపుతున్నారు. మామిడి తోటలు తొలగించిన తరువాత సారవంతమైన భూముల్లో స్వల్పకాలిక పంటలను సాగుచేయడం ద్వారా మామిడిలో వచ్చే ఆదాయం కన్నా ఎక్కువ ఆదాయాన్ని గడించవచ్చనే ఆలోచనకు రైతులు వచ్చారు. గత మూడేళ్ల కాలంలో తోటలను నరికివేసిన భూముల్లో మొక్కజొన్న, పత్తి, మిరప, నాటు పొగాకుతో పాటు ఆయిల్‌పామ్ తదితర పంటలను సాగుచేస్తున్నారు. గత నాలుగైదేళ్లుగా మామిడికి ధర రాకపోవడం, పెట్టుబడులు పెరగడం, దిగుబడి తగ్గిపోయి పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల్లో రైతులు నష్టాల పాలవుతున్నారు.

పెరిగిన తెగుళ్ల ఉధృతి

ఐదేళ్లుగా మామిడితోటలలో తెగుళ్ల ఉధృతి పెరగడం, సస్యరక్షణ చర్యలు చేపట్టినా నివారణ అంతంతమాత్రంగానే ఉండటంతో దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. దీనికి తోడు మామిడి ఎగుమతులు క్షీణిస్తూ ఉండటంతో రైతులు నష్టాలు చవి చూస్తున్నారు. వ్యయ ప్రయాసలకు ఓర్చి కాయలను మార్కెట్‌కు తరలిస్తే అక్కడ సరైన ధర లభించకపోగా, సెస్, సూటు తదితర పేర్లతో రైతులు దోపిడీకి గురవుతున్నారు. ధర ఉన్నా లేకపోయినా మామిడి కాయలను రైతులు ఏదొక రేటుకు అమ్ముకుంటున్నారు. దీంతో మామిడి సాగు తలకు మించిన భారంగా పరిణమించింది. గతంలో రైతులు తమకున్న మామిడి తోటల నుంచి వచ్చే ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకునేవారు. నేడు ఆ పరిస్థితులు పూర్తిగా కనుమరుగయ్యాయి.

ఏడేళ్ల క్రితం 53 వేల ఎకరాల్లో తోటలు

ఏడేళ్ల క్రితం నూజివీడు నియోజకవర్గంలో 53 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉండేవి. ఏటా దిగుబడి రాకపోవడం, వచ్చినా ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతినడమో, మార్కెట్‌లో ధర లేక నష్టాల పాలవడంతో రైతులకు ఆసక్తి సన్నగిల్లింది. రైతులు మామిడి అంటే నిరాసక్తత పెరిగి ఇతర పంటల వైపుకు మళ్లుతున్నారు. దీంతో ప్రస్తుతం నియోజకవర్గంలో 48 వేల ఎకరాల్లో మాత్రమే మామిడి తోటలున్నాయి. దాదాపు ఐదు వేల ఎకరాల్లో మామిడి తోటల విస్తీర్ణం తగ్గిపోయింది. ముదురు తోటలు నరికి ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు.

ప్రభుత్వ నియంత్రణ శూన్యం

మామిడి ధర నిర్ణయంలో ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల హవా కొనసాగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు ఇక్కడ కొనుగోలు చేసేటప్పుడు సిండికేట్‌గా మారి ధరను వారి చెప్పుచేతల్లో ఉంచుకుంటున్నారు. ఏటా ఇదే పరిస్థితి ఉండడంతో రైతుల్లో మామిడిపై విరక్తి కలిగి నరికివేస్తున్నారు. మామిడి కలపకు కాగితం పరిశ్రమలో డిమాండ్ ఉండటంతో మంచి ధరకు విక్రయించి బోర్లు, మోటర్లు ఏర్పాటు చేసుకుని వేరే పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో నూజివీడు డివిజన్ ప్రాధాన్యత కోల్పోతోంది.

పామాయిల్ సాగు వైపు మొగ్గు



ఆదాయం రాకపోవడంతో రైతులు వేరే పంటల వైపు వెళ్తున్నారు. ముఖ్యంగా మామిడి తోటలు నరికిన వారు పామాయిల్ తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీనికైతే పెట్టుబడి తక్కువ కావడమే కాకుండా కోతుల బెడద, కాపలా ఖర్చు, పురుగుమందుల పిచికారీ తదితర సమస్యలేవీ ఉండవు.

పల్లె రవీంద్రరెడ్డి, తూర్పు దిగవల్లి, నూజివీడు మండలం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమవరం: ద్విచక్ర వాహనం పై నుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24న కె.దీపక్ అరుణ్‌కుమార్ (22) జువ్వలపాలెం రోడ్డు నుంచి ఉండి రోడ్డుకు వెళ్లే దారిలో ద్విచక్రవాహనంపై నుంచి జారిపడి మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై ఇశ్రాయేలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బ్రాహ్మణేశ్వరమ్మ

చింతలపూడి: చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థినిలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్‌-19 విభాగంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించగా నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల నుంచి పదో తరగతి చదువుతున్న ఎస్.హేమలక్ష్మి ప్రసన్న, కె గౌరీ పూజ ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన విద్యార్థినిలతో పాటు పీఈటీ బాలభారతిని ఆదివారం ప్రిన్సిపాల్ బ్రాహ్మణేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఇసుక దొరక్క.. పనులు లేక





తణుకులో ఉచిత ఇసుక అందించాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు (ఫైల్), తణుకులో ప్రైవేటు నిర్మాణం కోసం గతంలోనే నిల్వ చేసిన ఇసుక

- తణుకు నియోజకవర్గంలో నిలిచిన నిర్మాణాలు
- పనులు లేక అల్లాడుతున్న కార్మికులు

తణుకు అర్బన్: ఉచిత ఇసుక ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేయగా.. కనీసం కొందామంటే ఇసుక దొరక్క భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో పనులు లేక భవన నిర్మాణ రంగ కార్మికులు అల్లాడుతున్నారు. పనుల్లేక పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి పార్టీని గెలిపిస్తే ఉచితంగా ఇస్తామని ఊదరగొట్టి 100 రోజులు దాటినా ఉచిత ఇసుకను అటకెక్కించారు. వేలాది రూపాయిలు వెచ్చిస్తేనే కాని ఇసుక దొరకని పరిస్థితి సృష్టించడంతో భవన నిర్మాణ రంగం కుదేలైంది. నిర్మాణ రంగానికి అనుసంధానంగా జరిగే వ్యాపారాలు నష్టపోయాయి. భవన నిర్మాణ కార్మికులను ఉద్ధరిస్తాం.. ఉచిత ఇసుక ఇస్తాం అన్న మాట ఏది బాబూ అంటూ భవన నిర్మాణ కార్మికులు నిలదీస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన ఇసుక నిల్వలను కూటమి నేతలు అక్రమ మార్గంలో అమ్ముకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇసుక సరఫరా లేకపోవడంతో నిర్మాణ రంగంలో ఉండే కూలీలతోపాటు తాపీమేస్త్రీలు, సెంట్రింగ్, వడ్రంగి పనివారు, ఎలక్ట్రీషియన్స్, పెయింటర్లు, ప్లంబర్లు, ఐరన్ పనివారు పనుల్లేక అల్లాడుతున్నారు. ఎలక్ట్రికల్, కలప, ప్లంబింగ్ మెటీరియల్ దుకాణాలు సైతం వ్యాపారాలు లేక అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు.

ఆన్‌లైన్ బుకింగ్‌లో బ్రోకర్ల ఇష్టారాజ్యం

ఇటీవలే ఆన్‌లైన్ బుకింగ్ తెరిచినప్పటికీ బ్రోకర్స్‌కు తప్ప నిర్మాణదారులకు అందని దుస్థితి. పేరుకే ఆన్‌లైన్‌లో బుకింగ్ అని.. ఆ సైట్‌లు కూడా ఓపెన్ కావడంలేదని అదే ఇసుక విక్రయాలు జరిపే బ్రోకర్లను సంప్రదిస్తే గతంలో మూడు యూనిట్లు ఉన్న ఇసుక లారీ రూ. 9 వేలు కాగా, నేడు రూ.15 వేలకు అమ్ముతున్నారని చెబుతున్నారు. దీంతో ఇసుక దొరక్క, బ్రోకర్ల వద్ద కొనుగోలు చేయలేని స్థితిలో నిర్మాణదారులు ఉండడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గిరాకీ లేని ట్రాన్స్‌పోర్టు వాహనాలు

ఉచిత ఇసుక లేకపోగా డబ్బులు పెట్టి కొందామన్నా ఇసుక దొరక్కపోవడంతో ఇసుక సరఫరా చేసే వాహనాలు కూడా మూలకు చేరాయి. ఇసుక రవాణాను నమ్ముకుని మూడు, ఐదు యూనిట్ల లారీలను కొనుగోలు చేసిన యజమానులు తమ వాహనాలను తిప్పే పరిస్థితి లేక అల్లాడిపోతున్నారు. వాహనాలకు ఫైనాన్స్‌లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. లారీలు, ట్రాక్టర్లు ఇళ్ల ముందే పెట్టుకుని చూడాల్సి వస్తుందని వాపోతున్నారు.

నిర్మాణాలు నిలిచిపోయాయి



ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తామన్న హామీని నెరవేర్చలేకపోయింది. ఉచితం కాదుకదా డబ్బులు పెట్టినా ఇసుక దొరకని పరిస్థితితో ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయి. దీంతో నిర్మాణ రంగంపై ఆధారపడ్డ కార్మికులు పూట గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక ఆధారంగా నిర్వహించే 40 రకాల వ్యాపారాలు ఆగిపోయాయి. ఇసుక ఉచితంగా అందిస్తామన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడలేదు. గోదావరి ప్రాంతం సమీపంలో ఉన్నప్పటికీ ప్రకృతి అందిస్తున్న ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో కొనుక్కోవాల్సిన దుస్థితి.

– పీవీ ప్రతాప్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

నష్టపరిహారం ఇవ్వాలి



ఇసుక సరఫరా సక్రమంగా లేకపోవడంతో భవన నిర్మాణాలు సాగక వడ్రంగి పనిపై ఆధారపడ్డ వారంతా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. పనులు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకునేందుకు అల్లాడిపోతూ అప్పుల పాలైపోతున్నారు. ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోగా ఇసుక సరఫరానే కాని విధంగా చేసినందుకు వడ్రంగి మేస్త్రీలకు నష్టపరిహారం అందచేయాలి.

– గోడి నాగబాబు, కార్పెంటర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, తణుకు

క్లుప్తంగా

రిఫ్రిజిరేటర్ వితరణ



లార్డ్ ఆఫ్ లైఫ్‌లో రిఫ్రిజిరేటర్ వితరణ చేస్తున్న ఆర్గనైజేషన్ ఫౌండర్, ట్రస్టీ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంకు దాతలు అరుణ్, అవినాష్ సహాయ సహకారాలతో రిఫ్రిజిరేటర్ వితరణ చేశారు. ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రికళ, ట్రస్టీ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు చెన్నా జనార్దన్‌రావులు మాట్లాడుతూ ట్రస్ట్ నుంచి ఎన్నో సేవలు అందించామని, మరిన్ని సేవలు అందిస్తామని చెప్పారు.

విద్యుత్ ఏడీఈగా రాజగోపాల్ చౌదరి



తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం టౌన్ విద్యుత్ డిప్యూటీ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ)గా ఎం.రాజగోపాల్ చౌదరి విధులలో చేరారు. బదిలీలో భాగంగా భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏడీఈ సతీష్ భీమవరం వెళ్లారు. రాజగోపాల్ చౌదరి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేని విధంగాను, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చూస్తామన్నారు.

ఇరగవరం పాఠశాలలో కళావేదిక ప్రారంభం



ఇరగవరం పాఠశాలలో దాత కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ఇరగవరం: పాఠశాలలో దాత సహకారంతో కళావేదిక నిర్మించడం అభినందనీయమని ఎంఈవో ప్రసాదరావు అన్నారు. ఆదివారం ఇరగవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దాత సామవేదం మాచేశ్వరశాస్త్రి ఆర్థిక సాయంతో నిర్మించిన కళావేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతను పలువురు వక్తలు అభినందించారు. కార్యక్రమంలో కొటికలపూడి చిట్టి వెంకయ్య, కడలి పైల్లరావు, ఏలూరి వీర వెంకటేశ్వరరావు, వీరవల్లి రామకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ జి.మహాలక్ష్మి, యు.వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయాబెటిక్ కిట్స్ పంపిణీ



తణుకు రోటరీ క్లబ్‌లో కిట్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: జిల్లా లయన్స్ డయాబెటిక్ చైర్ పర్సన్ వావిలాల సరళాదేవి ఆధ్వర్యంలో సుగర్ వ్యాధిగ్రస్తులకు డయాబెటిక్ కిట్స్ పంపిణీ చేసినట్లు చైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి తెలిపారు. ఆదివారం తణుకు రోటరీ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తణుకు పరిసరాల్లోని 125 మంది డయాబెటిక్ పేషెంట్లకు సుగర్ పరీక్షలకు అవసరమైన పరికరాలు ఉన్న కిట్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, వైస్ గవర్నర్లు పాపారావు నాయుడు, సుబ్బారావు, జిల్లా కార్యదర్శి శ్రీహరి, తణుకు లయన్స్ క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

'ఎంతపని చేశావ్ చంటి' చిత్ర యూనిట్ సందడి



కనకదుర్గ థియేటర్‌లో నటీనటులు

నరసాపురం రూరల్: నరసాపురంలో 'ఎంతపని చేశావ్ చంటి' చిత్ర యూనిట్ సభ్యులు ఆదివారం సందడి చేశారు. స్థానిక కనకదుర్గ థియేటర్‌లో ఈ చిత్రం ప్రదర్శితమవుతోంది. ఉదయం ఆట సమయంలో ఎంతపని చేశావ్ చంటి చిత్రంలోని హీరో, హీరోయిన్లు ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. నరసాపురం మండలంలోని వేములదీవి గ్రామానికి చెందిన ఉలిశెట్టి శ్రీనివాస్ హీరోగా నటించారు. ప్రేక్షకులను సినిమా డైలాగులు చెప్పి అలరించారు. హీరో శ్రీనివాస్ ఉలిశెట్టి, హీరోయిన్లు శాంతిప్రియ, నిహారిక, దర్శకుడు ఉదయకుమార్, ఇతర నటీనటులు, ప్రేక్షకులతో కలసి సినిమా వీక్షించారు.

పెనుమంట్రలో ధ్యాన శిక్షణ

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామంలో భూపతిరాజు శ్రీనివాసరాజు, సాయిగీత దంపతులచే నిర్మించిన బ్రహ్మర్షి పితామహ ధ్యాన మందిరం వద్ద భీమవరం పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ జి.శ్రీనివాసరావు పాల్గొని జ్ఞాన బోధ చేసి ధ్యాన శిక్షణ ఇచ్చారు.

బాణసంచా విక్రయాలపై అవగాహన



తణుకులో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కొండయ్య

తణుకు: దీపావళి బాణసంచా విక్రయదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని తణుకు పట్టణ సీఐ బి.కొండయ్య పేర్కొన్నారు. తణుకు పట్టణంలోని దీపావళి బాణసంచా విక్రయదారులకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఫైర్, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కొండయ్య మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 29, 30, 31 తేదీల్లో దీపావళి బాణసంచా విక్రయించుకునేందుకు 32 మందికి అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తణుకు ఫైర్ ఆఫీసర్ ఐ.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి దుకాణదారులు కచ్చితంగా నీటి డ్రమ్ముతోపాటు ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా వాహనాలు నిర్దేశిత ప్రదేశంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుకోని రీతిలో ప్రమాదం జరిగితే తప్పించుకోవడానికి వీలుగా మార్గాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ నిర్దేశించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. సమావేశంలో పట్టణ ఎస్సైలు కె.చంద్రశేఖర్, కె.శ్రీనివాస్, ఫైర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీలపై దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలి



అత్తిలిలో దళిత ఐక్యవేదిక సమావేశంలో మాట్లాడుతున్న గంజి మధు

అత్తిలి: ఎస్సీలపై జరుగుతున్న దాడులను ఐక్యతతో ఎదుర్కొనాలని దళిత ఐక్య వేదిక నియోజకవర్గ నాయకుడు గంజి మధు అన్నారు. ఆదివారం సాయంత్రం అత్తిలి సీపీఎం కార్యాలయంలో దళిత ఐక్యవేదిక సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గంజి మధు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా ఎస్సీలపై వరుస దాడులు జరుగుతున్నాయని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే అంతా కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్సీల రిజర్వేషన్‌లు కాపాడుకోవడం కోసం, ఎస్సీలలో ఐక్యత నింపడం కోసం గ్రామ స్థాయి నుంచి నిర్మాణం చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అత్తిలి మండల ఐక్య కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బుంగా ఇమ్మానియేలు, అధ్యక్షుడిగా పానుగు వినయ్, ఉపాధ్యక్షులుగా బత్తుల మోహన్, కుసుమే చంటి, ప్రధాన కార్యదర్శిగా బట్టు నాగరాజు, సహాయ కార్యదర్శులుగా మురాల చింటూ, యాళ్ల ఇస్రాయేలు, కోశాధికారిగా కుసుమే కిట్టు, సభ్యులుగా వెంకట్, కలవపూడి సందీప్, సరిపల్లి రామకృష్ణ, మేడపాటి వెంకి, బద్దా యెషయ్య, చుక్కా పండు ఎన్నికయ్యారు.

కళాకారుల సంఘం సేవలు అభినందనీయం



గూడెం మున్సిపల్ కళ్యాణ మండపంలో సంగీత కచేరి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంఘం సేవలు అభినందనీయమని పలువురు కళాకారులు కొనియాడారు. 149వ నెలవారీ సంఘ సమావేశం పట్టణంలో ఆదివారం రాత్రి 3వ వార్డు వీకర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలోని నాన్న మునిసిపల్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ అధ్యక్షత వహించారు. దశిక శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సంగీత కచేరి నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగి తానింకి శ్రీహరికి గౌరవ సత్కారం, కళాకారుడు ఈవీ సత్యనారాయణకు కళా సత్కారం, లెక్చరర్ బైర్ల సురేంద్రకు ఉద్యోగ పురస్కారం, హరికథ కళాకారిణి శ్రీవాణి (దువ్వ)కు ఆర్థిక సత్కారం చేశారు. ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి బాబురావు, శ్రీశ్రీ కళావేదిక కన్వీనర్ కొల్లి రమావతి, పెంటపాడు ఎంఈఓ టీవీ రామకృష్ణ, ఆకుల నాగేశ్వరరావు, సుంకర గోపాల్, తెన్నేటి మాస్టారులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



సీఐ కె రజనీకుమార్

పాలకొల్లు సెంట్రల్: అనుమతులులేకుండా ఎవ్వరైనా బాణ సంచా మందులు తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని పట్టణ సిఐ కె రజనీకుమార్ హెచ్చరించారు. ఆదివారం దీపావళి బాణసంచా మందుల విక్రయదారులనుద్దేశించి కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ అన్ని అనుమతులతో షాపులు నిర్వహించే వ్యాపారస్తులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అలాగే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా కాల్చే సమయంలోనూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పండుగ సమయంలో కుటుంబ సభ్యులందరూ ఆనందోత్సాహాలతో ఉండాలంటే బాణసంచా కాల్చే సమయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్స్ ఉన్న వారు మాత్రమే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా ఎవరైనా బాణసంచా వ్యాపారాలు కొనసాగిస్తే మాత్రం చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా విక్రయ, తయారీదారులు తమ పరిసరాల్లో ఇసుక, ఫైర్ సేఫ్టీ సామగ్రి, వాటర్ వంటి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. శాశ్వత, తాత్కాలిక లైసెన్స్ కలిగిన వారు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. తాత్కాలిక లైసెన్స్ వ్యాపారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతలు మేరకు ప్రత్యేక షెడ్లుల్లో ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైనర్లను బాణసంచా విక్రయాల వద్ద ఉంచరాదన్నారు. లైసెన్స్ కలిగిన విక్రయదారులు లైసెన్స్ లేనివారికి విక్రయించిన తద్వారా ఏదైనా ప్రమాదం జరిగినా దానికి లైసెన్స్ దారుడే పూర్తి భాధ్యత వహించాలన్నారు. దుకాణాలు జనావాసాలకు, విద్యా సంస్థలకు, ఆసుపత్రులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా బాణసంచా విక్రయాలు, తయారీ చేయడం వంటివి చేస్తే బీఎన్ఎస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి రోజున ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా అత్యవసర సమయంలో ఫైర్‌స్టేషన్ నెంబర్ 101, పోలీసు నెంబర్ 100 లేదా 112, 08814–222333లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



ఆధ్యాత్మిక క్షేత్రాల వివరాలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎం, ఆర్టీసీ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆధ్యాత్మిక క్షేత్రాల దర్శనం నిమిత్తం ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం డిపోనుంచి ఆర్టీసీ ప్రత్యేక లగ్జరీ బస్సులు, పల్లె వెలుగు బస్సులు నడుపుతుందని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలో ఆదివారం ఛార్జీలు, బస్సు సమయాలు వెల్లడించారు.

పంచారామ శైవ క్షేత్రదర్శిని

పంచారామ శైవ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారమం, సామర్లకోటను ఒకే రోజు దర్శించుకునేలా తాడేపల్లిగూడెం డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. బస్సులు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో ఆదివారం రాత్రి 9 గంటలకు బయలుదేరుతాయని, పల్లె వెలుగు చార్జి పెద్దలకు రూ 720, సూపర్ లగ్జరీ పెద్దలకు రూ.1200.

అరుణాచల గిరి ప్రదక్షిణ

అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం నవంబర్ 13, డిసెంబర్ 13న రాత్రి 7 గంటలకు బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. శ్రీ కాళహస్తి, కాణిపాకం వినాయక దర్శనం, శ్రీపురం లక్ష్మీదేవి స్వర్ణ దేవాలయం, అరుణాచలేశ్వరుని దర్శనం ఉంటాయని చెప్పారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ చార్జీ రూ. 2600.

ఏకాదశ రుద్రల దర్శనం

ఏకాదశరుద్రల దర్శినిలో భాగంగా నవంబర్ 27, డిశంబర్ 4, 11 తేదీలలో ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు ప్రత్యేక బస్సులు ఉంటాయని, పల్లె వెలుగు చార్జీ ఒక్కరికి రూ.350 అని తెలిపారు. వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, పాలగుమ్మి, మొసలపల్లి, ముక్కామల, నేదునూరు, పక్కిలంక, ఇరుసుమండ ప్రాంతాలు దర్శించుకోవచ్చని తెలిపారు.

సప్త శ్రీనివాస దర్శనం

ధనుర్మాసంలో ఒకే రోజున సప్త శ్రీనివాస దర్శనం ప్రతి శనివారం ఉదయం 5 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. అప్పనపల్లి, అబ్బిరాజపాలెం, కొండమంచిలి, అన్నవరప్పాడు, వాడపల్లి, ద్వారకాతిరుమల, కాళ్ళకూరు దర్శనాలు చేసుకోవచ్చునని, అదే రోజు రాత్రి 8 గంటలకు తాడేపల్లిగూడెం డిపో చేరుతుందని చెప్పారు. పల్లె వెలుగు బస్సుకు ఒక్కరికి రూ.350 ఉంటుందని చెప్పారు.

నవ జనార్దన్ క్షేత్రాలు

గోదావరి తీరాన ప్రతిష్ఠించిన నవ జనార్ధన క్షేత్రాలైన ధవళేశ్వరం, మడికి, జొన్నాడ, ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం, మాచర, కోరుమిల్లి, కోటిపల్లి దర్శనాలకు ధనుర్మాసంలో ప్రతి శనివారం బస్సు బయలుదేరుతుందని, పల్లె వెలుగు బస్సు ఛార్జీ రూ.300 ఉంటుందని చెప్పారు.

భద్రాచల దర్శనం

భద్రాచలం రాముడి దర్శనం, పర్ణశాల దర్శనం, జంగారెడ్డిగూడెం పారిజాత వెంకటేశ్వరస్వామి దర్శనం, మద్ది ఆంజనేయ స్వామి దర్శనం, ద్వారకా తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శనాలకు శనివారం బస్సు బయలుదేరుతుందని, పల్లె వెలుగు బస్సు ఛార్జీ రూ.600

శివకేశవ దర్శనం:

శివకేశవల దర్శనంలో భాగంగా ముక్తేశ్వరం, కుండలేశ్వరం, మురమళ్ళ, అప్పనపల్లి, అంతర్వేది, పాలకొల్లు దర్శనాలకు ప్రతి శనివారం, సోమవారం బస్సులు బయలుదేరుతాయని, పల్లె వెలుగు బస్సు చార్జీ ఒకరికి రూ.400 అని తెలిపారు. శబరిమలకు ప్రత్యేక బస్సులు నడపుతామని వివరించారు.

విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేత

తణుకు టౌన్: పీజీ సెట్ 2024 ఎమ్మెస్సీ స్టాటిస్టిక్ సబ్జెక్ట్‌లో 20వ ర్యాంక్ సాధించిన విద్యార్థిని పాట్నూరి సూర్య ప్రభకు తణుకు మానవత సంస్థ రూ.25 వేల ప్రతిభా పురస్కారం అందజేసినట్లు తణుకు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. ఆదివారం తణుకు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన మానవత సంస్థ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెలలో మానవత సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సూర్య ప్రభకు ప్రతిభా పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కార్యదర్శి బొల్లం రామకాశీ, జిల్లా కన్వీనర్లు ఎస్వీ సతీష్‌బాబు, బీ రామలక్ష్మీ, మల్లిపూడి లక్ష్మీ, వీవీ రామకృష్ణ, మల్లిన అరుణ సారధి పాల్గొన్నారు.

నేడు తణుకు మండల పరిషత్ సమావేశం

తణుకు టౌన్: ఈ నెల 28న తణుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తణుకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

నకిలీ అర్చక పరీక్షలు రద్దు చేయాలి

భీమవరం: పురోహిత, అర్చక సమాఖ్య పరీక్షల పేరిట నకిలీ సర్టిఫికెట్లతో అక్రమార్జనలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌వీఎన్ శర్మ, జి.ధనుష్ తెలిపారు. వివిధ ప్రాంతాల దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులకు, పురోహితులకు పరీక్షలు నిర్వహించి, అర్హత పట్టాలు అందజేస్తామని, ఆ పట్టాల ద్వారా లోన్లు పొందొచ్చంటూ నమ్మించి మోసం చేస్తున్నారన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో ఆరుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సుంకవల్లి నీలూ మహేంద్రల ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణంలోని పరిసర గ్రామాల్లో మంచం నుంచి లేవలేని ఆరుగురు వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు అతికాల ప్రసాదరావు సాయంతో సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం డివిజన్ ఏపీఎస్ ఈబి (విద్యుత్ శాఖ) ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు రీజనల్ సెక్రటరీ నీతిపూడి వెంకట్రావు ఆదివారం తెలిపారు. డివిజన్ అధ్యక్షుడిగా బి.నరేంద్ర శ్రీనివాస్, కార్యదర్శిగా కె.సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై.ప్రభాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా కె.నాని, కమ్యూనికేషన్ కార్యదర్శిగా వై.నారాయణరావులతో పాటు నలుగురు కార్యవర్గ సభ్యులుగా ఎంపికచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు డివిజినల్ ఇంజనీర్ కొల్లాబత్తుల మధుకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

నాగరాజుకు ఏఓగా పదోన్నతి

పెనుగొండ: ఆచంట ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న బొమ్మిడి నాగరాజు మండల వ్యవసాయాధికారిగా పదోన్నతి పొందారు. దీంతో ఆదివారం ఆచంట శాసన సభ్యుడు పితాని సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆచంట మండలానికి నూతన వ్యవసాయ విస్తరణాధికారిగా గుబ్బల నరేష్ కుమార్ నియమితులయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలి



ఇరగవరంలో మాట్లాడుతున్న బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు

ఇరగవరం: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం జనగణనలో సమగ్ర కుల గణన వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ 44 శాతానికి పెంచాలని జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘంజాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇరగవరంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీసీలు అనేక సంవత్సరాలుగా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో అగ్ర వర్ణాలతో సమానంగా ఎదగాలని, బీసీ సంఘాలు పోరాటం చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గ అధ్యక్షుడిగా గుత్తుల తులసిగిరి, ఇరగవరం మండల అధ్యక్షుడిగా బొల్లా రాము, తణుకు పట్టణ అధ్యక్షుడిగా ఆకుల సాయి కరుణకుమార్, తణుకు పట్టణ మహిళా అధ్యక్షురాలిగా మనుబర్తి లలితలకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మల్లుల లక్ష్మీ నారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ దొమ్మేటి వెంకట సుధాకర్, జాతీయ ఉపాధ్యక్షుడు కడియాల సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రు అప్పారావు, నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు వీరవల్లి పాలేశ్వరరావు, సూరిశెట్టి కల్పన పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ వినాయక స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుండీ అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రామనామ స్మరణతో కొప్పర్రు గ్రామం మార్మోగింది. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. నిర్వాహకులు సవరం సత్యనారాయణ, ధర్మరాజు దంపతులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన హోమాలు, రత్నన్యాసం, ధాతున్యాసం, బీజన్యాసం, యంత్రస్థాపన కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం శిలా విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మహాపూర్ణాహుతి, కుంభ కళావాహన, గోదర్శన, కుంభప్రోక్షణ, శాంతి కల్యాణం వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలిశెట్టి సీతారామయ్య, పోలిశెట్టి శ్రీనివాసరావు (నాని) తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని చెప్పారు.